క్లుప్తంగా

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ

బేతంచెర్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో త్రైత సిద్ధాంతం తెలుగు నూతన సంవత్సర ఉగాది క్యాలెండర్లను తహసీల్దార్ ప్రకాశ్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. విశ్వావసు సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తహసీల్దార్ ఆకాంక్షించారు. త్రైత సిద్ధాంత సభ్యులు కొండా రెడ్డి, మద్దిలేటి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225795 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి

కోవెలకుంట్ల: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ డీఏలను చెల్లించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం. షరీఫ్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్లలో మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, పీపీఎఫ్, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కరువు భత్యంలో ఒక డీఏనైనా ఉగాది పండుగ కానుకగా ఇవ్వాలని కోరారు. 12వ పీఆర్సీని నియమించి సముచిత రీతిలో ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు.

క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక


బాలాజీ సింగ్

కోవెలకుంట్ల: అఖిల భారతీయ క్షత్రియ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ బాలాజీ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజుల క్రితం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజా మన్వేంద్రసింగ్ అధ్యక్షతన వివిధ రాష్ట్రాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి బాలాజీసింగ్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని క్షత్రియ కులస్తులందరిని ఒక తాటిపైకి తెచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉగాది ఉత్సవాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న రామరాజు

కొలిమిగుండ్ల: కోటపాడులో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవాలకు రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆర్థిక సాయం అందజేసింది. మంగళవారం కంపెనీ కార్యాలయంలో గ్రామపెద్దలు, నిర్వాహకులకు రామ్‌కో అడ్మిన్ ప్రెసిడెంట్ రామరాజు రూ.60 వేలను అందించారు. ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో ప్రజలు చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం పెద్ద ఎత్తున జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ పెద్దల కోరిక మేరకు ఉత్సవాల కోసం సాయం అందించినట్లు రామరాజు తెలిపారు.

వేలం పాట వాయిదా


ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: మున్సిపల్ పరిధిలోని దిన, వారపు సంతలతో పాటు జంతువధశాల, బస్టాండ్ రుసుం వసూలు కోసం మంగళవారం నిర్వహించిన వేలంపాటకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈనెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటకు కాంట్రాక్టర్లు ఎవరూ హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 28వ తేదీ టెండర్ బాక్సును ఏర్పాటు చేసి ఎవరు ఎక్కువ టెండర్ కోట్ చేస్తారో వారికే ఆయా రుసుం వసూలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇది కూడా మున్సిపల్ ఆదాయానికి గండిపడే విధంగా ఉంటే సమావేశంలో చర్చించి తిరస్కరిస్తామని చైర్మన్ రాజేష్ స్పష్టం చేశారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

డోన్ టౌన్: భవనాలు, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు ప్రభుత్వం జీఓ జారీ చేసిందని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు పన్ను బకాయిలు మొత్తం చెల్లించే వారికి ఇది వర్తిస్తుందన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

మా ప్రభుత్వం అధికారంలో ఉంది.. ఏది చెబితే అది జరగాలి. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసినా ఎవరూ ప్రశ్నించకూడదు..ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే రీతిలో డోన్ టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు వారికి వత్తాసు పలుకుతుండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

- ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ స్థలాల్లో బంకుల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- టూలెట్ బోర్డులతో దర్శనమిస్తున్న బంకులు
- మున్సిపల్ ఆదాయానికి గండి



జాడీల ఫ్యాక్టరీ ఎదుట బంకులు అద్దెకు ఇవ్వబడును అని ఏర్పాటు చేసిన బోర్డు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే వాహనాల పార్కింగ్

డోన్: మున్సిపల్ పరిధిలో కాస్తంత ఖాళీ స్థలం కనపడితే చాలు అధికార పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది పాగా వేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్ ఆనుకుని ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా ఒక చోట నాయకుడు ఏకంగా దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ దుకాణం ముందు విద్యుత్ స్తంభంతో పాటు మార్కెట్‌ను ప్రారంభించిన శిలాఫలకం దిమ్మె అడ్డుగా ఉన్నా లెక్కచేయకుండా బంకును ఉంచాడు. దీని కారణంగా అటు మార్కెట్‌కు ఇటు అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు రహదారి సౌకర్యం లేకుండా పోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

జాడీల ఫ్యాక్టరీ ఆవరణలో ప్రైవేటు వాహనాలను విచ్చలవిడిగా నిలుపుతుండడం వల్ల హౌసింగ్, స్త్రీ శక్తి భవనం, మహిళా టైలరింగ్ శిక్షణ కేంద్రాలకు వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన గేటుకు తాళం వేయకపోవడం, ఇక్కడ వాచ్‌మెన్‌ను నియమించకపోవడం వంటి కారణాల వల్ల రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులకు అద్దె వసూలు చేస్తామని చెప్పడం గమనార్హం.

స్థలం ప్రభుత్వానిది.. అద్దె ప్రైవేటు వ్యక్తికి

స్థానిక కంబాలపాడు రహదారి పక్కనున్న జాడీల ఫ్యాక్టరీ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో బంకులు వేసి బాడుగకు ఇవ్వబడును అనే బోర్డును తగిలించడం విశేషం. పొట్టకూటి కోసం కూలీ నాలీ చేసుకునే చిరు వ్యాపారులు కాకుండా ధనవంతులు ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బంకులను ఏర్పాటు చేసి కిరాయిలకు ఇచ్చుకొని వేల రూపాయలను అక్రమంగా అర్జిస్తున్నారు. దీని వల్ల మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్నా సంబంధిత అధికారులు దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా తమకేమీ పట్టనట్లు ప్రవర్తిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ఆక్రమణలపై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


పాత బస్టాండ్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన బంకు

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాడికి ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. పని నిమిత్తం బైక్‌లో కొలిమిగుండ్లకు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఊరి శివార్లలోకి వెళ్లగానే జమ్మలమడుగు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

ఆయిల్ పామ్‌పై అవగాహన

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సచివాలయంలో పతంజలి ఆయిల్ పామ్ సాగుపై ఏఓ కిరణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి రఘువరన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. పండ్ల తోటల సాగుతోపాటు ఆయిల్ పామ్ సాగు కూడా రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. పతంజలి ఈ మొక్కలను 100 శాతం సబ్సిడీతో రైతులకు ఇస్తుందన్నారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె రూరల్: గ్రామైక్య సంఘాల తీర్మాణం లేకుండా వీఓఏలను అక్రమంగా తొలగించిన బనగానపల్లె ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని వీఓఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం ఎదుట వెలుగు వీఓఏల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆంజనేయస్వామి క్లస్టర్‌లో పనిచేసే నలుగురు వీఓఏలను గ్రామ సంఘం తీర్మాణాలు లేకుండానే ఏపీఎం తొలగించారని తెలిపారు. అనంతరం పీడీ శ్రీధర్‌రెడ్డికి సమస్యను వివరించారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

కొలిమిగుండ్ల: వ్యాపార సముదాయాల్లో పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని బనగానపల్లె సోషల్ వెల్ఫేర్ సహాయ కార్మిక అధికారిణి శోభారాణి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్సీపీసీఆర్ చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం కొలిమిగుండ్లలో పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఒకటి, రెండు దుకాణాల్లో మైనర్లను పనుల్లో పెట్టుకున్నట్లు గుర్తించి వ్యాపారులను హెచ్చరించారు. చట్ట ప్రకారం 18 ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరూ పిల్లలను పనులకు పిలుచుకోవద్దని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వ్యాపారులకు అవగాహన కల్పించారు.


ఎలక్ట్రికల్ షాపులో అవగాహన కల్పిస్తున్న సోషల్ వెల్ఫేర్ అధికారిణి

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి


ఆకుమల్ల జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీహరిగోపాల్

సంజామల: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల జగనన్న కాలనీలను హౌసింగ్ ఏఈ బాలచంద్రుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు అదనపు నగదు విడుదల చేశామని తెలిపారు. నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల కోసం బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తామని చెప్పారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే అదనపు సాయం వర్తిస్తుందన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్: పట్టణ శివారులో రెండు రోజుల క్రితం మృతి చెందిన మతిస్థిమితం లేని యాచకుని శవానికి డోన్ రూరల్ పోలీసుల కోరిక మేరకు ద్రోణాచలం ఆత్మబంధువు సేవాసమితి సభ్యులు మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన అంత్యక్రియలకు అయ్యే ఖర్చును వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి భరించారు. అంతిమ యాత్రకు అవసరమైన వాహనాన్ని రోటరీక్లబ్ రాజయ్య సమకూర్చారని సేవా సమితి వ్యవస్థాపకుడు షాధిఖాన రాజు తెలిపారు. రూరల్ ఎస్ఐ మమత, ఏఎస్ఐ గోపాల్, కానిస్టేబుల్ రజాక్, సేవాసమితి సభ్యులు తాహెర్, సయ్యద్‌వలి పాల్గొన్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు, ఆత్మబంధువు సభ్యులు

‘స్వయం’ సంఘాల బలోపేతానికి కృషి

బనగానపల్లె రూరల్: స్వయం సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికల తయారీపై ఏపీఎం, సీసీలకు డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీడీ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల జీవనోపాధిపై ప్రత్యేక యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని వల్ల పొదుపు సంఘాల వివరాలు సులభంగా తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. తద్వారా బ్యాంకుల ద్వారా రుణాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవచ్చని చెప్పారు. సంఘాల బలోపేతానికి ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ గత మేనేజర్ కృష్ణమూర్తి స్వయం సంఘాలకు వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ వెలుగు పీడీ

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బేతంచెర్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తమ సమస్యలను మాజీ మంత్రి బుగ్గనకు విన్నవించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, అకాల వర్షాలతో దెబ్బతిన్న మామిడి, అరటి పంట రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటలకు గిట్టుబాటు ధరతో పాటు, పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించేదని గుర్తు చేశారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న సమయంలో నష్ట పరిహారం అందేదని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉన్నామన్నారు. టీడీపీ నేతలకు హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా విస్మరించడం వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. బేతంచెర్ల వ్యాగన్ లోడింగ్, సివిల్ లారీ లోడింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాఘవరెడ్డి, ఎర్రమల, గంగన్న కూలి రేట్ల పెంపు విషయాన్ని బుగ్గన దృష్టికి తీసుకొచ్చారు.

పరామర్శ

మండల పరిధిలోని యంబాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మద్దిలేటిస్వామి ఆలయ మాజీ ధర్మకర్త కృష్ణారెడ్డి ఈ నెల 18న గుండెపోటుతో మృతిచెందారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఆర్. నారాయణ, ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి, సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు ఉన్నారు.


లోడింగ్ కార్మికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

గ్రామాల సందర్శన

మండలంలోని సీతారామాపురం, యంబాయి గ్రామాలను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సందర్శించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీతారామాపురం గ్రామంలో సర్పంచ్ చిట్టి వేణుగోపాల్‌రెడ్డి సోదరుని కొడుకు తిరుపతిరెడ్డి, హరిత వివాహం ఇటీవలే జరిగింది. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తుజావలీ, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.


సీతారామాపురంలో పార్టీ నేతలతో బుగ్గన

నేడు డోన్‌కు మాజీ మంత్రి బుగ్గన

డోన్ టౌన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం డోన్‌కు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బుగ్గన స్వగృహంలో (వైఎస్సార్‌సీపీ కార్యాలయం) ప్రజలకు అందుబాటులో ఉంటారని..పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పేర్కొంది.

మూగజీవాలకు నీటి సౌకర్యం


తొట్టెలో ట్యాంకర్‌తో నీటిని నింపుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: వేసవిలో ఎండలు మండుతుండడంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. గతంలో కొలిమిగుండ్లలో నిర్మించిన నీటి తొట్టెలు వృథాగా మారాయి. దీంతో సర్పంచ్ శివరాముడు అపరిశుభ్రంగా మారిన నీటి తొట్టెను శుభ్రం చేయించి ట్యాంకర్‌తో నీటిని నింపారు. పాడిగేదెలు, గొర్రెలు, మేకలు గ్రామంలో అధికంగా ఉన్నాయి. మేత కోసం బయటకు వచ్చిన మూగజీవాలకు ఎక్కడా నీటి సౌకర్యం లేక అల్లాడిపోతుండేవి. దీంతో తొట్టెను క్లీని చేయించి నీటితో నింపామని సర్పంచ్ తెలిపారు. వేసవి పూర్తయ్యే వరకు పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి సౌకర్యం అందిస్తామని చెప్పారు.

ముగిసిన ప్రాణప్రతిష్ట వేడుకలు

డోన్ టౌన్: డోన్ అవోపా ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి పంచలోహ విగ్రహాల ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు విశేష పూజలు నిర్వహించారు. ఎవ్వరైనా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించాలనుకుంటే అవోపా సంఘాన్ని సంప్రదిస్తే విగ్రహాలు అందిస్తామని ఆ సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు తెలిపారు.


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

డోన్ టౌన్: వేసవిలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని.. ఎక్కడా సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులతో సమీక్షించారు. ఆర్డీఓ నరసింహులు, నేషనల్ హైవే ఆథారిటీ, ఇరిగేషన్, ఫారెస్టు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో వివిధ పనులపై చర్చించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.4,18,681 చెక్కులను బాధితులకు అందజేశారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోట్ల


ఇటీవల కురిసిన వర్షానికి తహసీల్దార్ కార్యాలయంలో ఉంచిన బకెట్లు (ఇన్‌సెట్) శిథిలావస్థలో భవనం

వర్షం వస్తే బకెట్లు ఉండాల్సిందే..!

ప్యాపిలి: వర్షం వస్తే చాలు ప్యాపిలి తహసీల్దార్ కార్యాలయంలో బకెట్లు ఉంచాల్సిందే. గదులన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో కారుతున్న నీటిని పట్టుకోవడానికి మూడునాలుగు బకెట్లు ఉంచాల్సిన పరిస్థితి. సుమారు వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఈ కార్యాలయం ప్రస్తుతం దెబ్బతింది. కార్యాలయంలోని పలు గదుల్లో పైకప్పు దూలాలు శిథిలావస్థలో ఉన్నాయి. అవి ఎప్పుడు విరిగిపడతాయో అనే భయంతో అధికారులు ఆ గదులకు తాళాలు వేశారు. దీంతో పలువురు అధికారులు కూర్చునేందుకు అనువైన గదులు లేవు. చిన్న వర్షం వచ్చినా పై కప్పు నుంచి వర్షపు నీరు కారుతోంది. ప్రధానంగా రికార్డుల గదికి కూడా సరైన భద్రత లేదు. ఈ గదిలో కూడా పైకప్పు నుంచి వర్షపు నీరు కారితే రికార్డులన్నీ తడిసిపోయే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన కార్యాలయాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం అక్కడక్కడ పగుళ్లు ఇవ్వడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్తంభానికి ఏర్పాటు చేశారు. ఒరిగిపోకుండా రెండు వైపులా తీగలు ఏర్పాటు చేసినా ఒరిగింది. బలమైన గాలులు వీస్తే పడిపోయే ప్రమాదముంది. దెబ్బతిన్న స్తంభంతో పాటు మిగిలిన స్తంభాలు పడిపోయే ప్రమాదముంది. ప్రధాన రహదారి కావడంతో వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యుత్ శాఖ అధికారులు త్వరగా స్తంభాన్ని మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బావిలో ఈత కొడుతున్న యువకులు


నీటిలోకి డైవ్ చేస్తున్న యువకుడు

చిల్ బ్రో..!

మార్చి నెల నుంచే సూర్యుడు విజృంభిస్తున్నాడు. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగతో జనం అల్లాడిపోతున్నారు. ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందాలని కొందరు శీతల పానీయాలు సేవిస్తూ సేద తీరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత బావులు, లోతట్టు గుంతల్లో ఈత కొడుతూ చిల్ అవుతున్నారు. బావుల్లో నీరు సంపూర్ణంగా ఉండడంతో యువత ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు.

– సంజామల